క్లుప్తంగా

12న వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం



గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదూర్రులో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాన్ని ఈనెల 12వతేదీన జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రారంభిస్తారని సర్పంచి నక్కా కమల, గ్రామ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని వారు వివరించారు. విలేజ్ క్లీనిక్ అందుబాటులోకి వస్తే వైద్యసేవలు గ్రామస్తులకు మరింత చేరువవుతాయని తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సులభ్‌కాంప్లెక్స్ శ్లాబ్ పనులను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి పనులకు ఈ నెలలో ప్రారంభోత్సవాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం



జగ్గయ్యపేట అర్బన్: మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక దుర్గాపురంలో హోల్‌సేల్ ధరలకే బఫే పేట్ల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తోందన్నారు. ఈ రోజు ప్రారంభించిన ఈ చిన్న వ్యాపారం భవిష్యత్‌లో మంచి లాభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ మునిహేరా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీవో ఎం. పద్మావతి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నందిగామ ఆర్టీవో కార్యాలయ పరిధిలోని జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి, పలు ప్రధాన రహదారులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దత్తసాయి మందిర వార్షికోత్సవాలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం మందిర 9వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభించారు. లోక కళ్యాణార్థం బాబావారికి విశేషంగా పలు పండ్లరసాలు, దివ్య ద్రవ్యములతో అభిషేకం చేశారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన హనుమాన్ చాలీసా, బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

అభివృద్ధిపథంలో కొత్తపేట

- నవరత్నాలతో సంక్షేమ విప్లవం..
- నాన్‌డీబీటీ ద్వారా కొత్తపేటవాసులకు రూ.11.43కోట్లు అందజేత
- గ్రామంలో రూ.3.22కోట్లతో అభివృద్ధి పనులు
- సీసీరోడ్ల నిర్మాణం
- పెరిగిన మౌలికవసతులు



ఎస్సీకాలనీలో నిర్మించిన సిమెంటురోడ్డు



కొత్తపేటలో నిర్మించిన గ్రామసచివాలయం భవనం



నాడు-నేడు పథకం కింద కొత్తహంగులతో కొత్తపేట పాఠశాల

ఇది కదా.. అభివృద్ధి

కంచికచర్ల : మండలంలోని కొత్తపేట గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలుచేసిన అనేక సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ విధానంలో కోట్లాది రూపాయల నగదు గ్రామస్తుల బ్యాంకు ఖాతాలో జమచేయగా, ఆయా నిధులతో డ్వాక్రా మహిళలు, ఇతర వృత్తిదారులు అభివృద్ధిపథంలో పయనిస్తున్నారు. ఇక గ్రామంలో సీఎం జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక గ్రామాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3.22కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. కొత్తపేట గ్రామాభివృద్ధి కోసం నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు దక్కేలా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తూ, అవసరమైతే జిల్లాస్థాయిలో కలెక్టర్‌తో సైతం మాట్లాడి ఆయా లబ్ధిదారులకు న్యాయం చేశారని వారు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

నవరత్నాల ద్వారా రూ.11.43కోట్ల లబ్ధి...

నవరత్న పథకాలతో గ్రామస్తులతో కోట్లాది రూపాయల లబ్ధి చేకూరింది. జగనన్న అమ్మఒడి పథకం, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యా దీవెన, వైఎస్సార్ రైతుభరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీకే పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ, మత్స్యకార భరోసా, పింఛను కానుక, చేయూత, ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కళ్యాణమస్తు, ఆసరా, వైఎస్సార్ బీమా, వాహనమిత్ర, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, జగనన్న తోడు వంటి అనేక పథకాల ద్వారా గ్రామంలోని 6814మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 11.43కోట్ల మేర లబ్ధిచేకూరింది. కులమతాలకు అతీతంగా అర్హతే ప్రమాణీకంగా అగ్రవర్ణ పేదలకు సైతం ఆయా ప్రభుత్వ పథకాలను అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

సిమెంటురోడ్ల నిర్మాణం..

గ్రామంలోని అన్ని వీధులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు. డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. వేసవికాలంలో సైతం రక్షిత మంచినీటి పథకం ద్వారా నిత్యం మంచినీరు సరఫరా చేస్తుండటంతో ప్రజల మంచినీటి ఇక్కట్లు తొలగాయి. ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.40లక్షలతో సచివాలయం..

గ్రామంలో రూ.40లక్షలతో సచివాలయ నిర్మాణం చేపట్టారు. రైతుభరోసా కేంద్రం పనులు కూడా సాగుతున్నాయి.

ఇక నాన్ డీబీటీ విధానంలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు, పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద, చిన్నారులకు జగనన్న సంపూర్ణ పోషణ, నాడు-నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కొత్తపేట గ్రామానికి ఇప్పటివరకు రూ.3,22,42,727లు లబ్ధి చేకూరింది. ఇలా కొత్తపేట గ్రామస్తులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇప్పటివరకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం రూ.14,65కోట్ల మేర లబ్ధి చేకూరిందని అధికారులు చెబుతున్నారు.

స్థలాలకు టీడీపీ నాయకుల మోకాలడ్డు..

గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న కాలనీల ద్వారా ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. కాని కొత్తపేట గ్రామంలో మాత్రం పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా టీడీపీ నాయకులు మోకాలడ్డారు. గ్రామానికి ఒక వైపు కృష్ణానది ఉండగా, మిగిలిన మూడు వైపులా తెలుగుదేశంపార్టీ నాయకులకు సంబంధించిన పొలాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు భూములు ఇవ్వకుండా భూసేకరణకు అడ్డుపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే దురుద్దేశంతో టీడీపీ నాయకులు భూసేకరణ ప్రక్రియను కుట్రలతో అడ్డుకుని తమకు ఇళ్లస్థలాలు అందకుండా చేశారంటూ గ్రామంలోని పేదలు మండిపడుతున్నారు.

మహిళలను ఆదుకున్న సీఎం జగనన్న..



సీఎం జగనన్న డ్వాక్రా సంఘాల మహిళలకు తక్కువ వడ్డీకి బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చి ఆదుకున్నారు. డ్వాక్రా రుణమాఫీ చేశారు. ఆసరా పథకం కింద రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు ఈ నాలుగేళ్లలో రూ.25వేల కోట్లను అందజేశారు. తనపాలనలో మహిళలకు పెద్దపీట వేసిన సీఎం జగనన్న మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మందా కోటేశ్వరమ్మ, డ్వాక్రా మహిళ

నవరత్నాలతో రూ.కోట్లలో లబ్ధి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన నవరత్నాలు పథకాల ద్వారా గ్రామంలోని ప్రజలకు కోట్లాది రూపాయల మేర లబ్ధి చేకూరింది. అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాయి. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న సీఎం జగనన్నను ఎన్నటికి మర్చిపోము.

– ముప్పాళ్ల సత్యనారాయణ, ఉపసర్పంచి

సీఎం జగనన్నకు రుణపడి ఉన్నాం..



గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సీఎం జగనన్న ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సీఎం జగనన్నకు గ్రామమంతా రుణపడి ఉంటుంది.

– ప్రత్తిపాటి సునీత, సర్పంచి,

443 మందికి వైద్యపరీక్షలు



మెడికల్ కిట్‌ను పంపిణీ చేస్తున్న నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని

నందిగామ: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణంలోని 7వ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కింద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు సీతారావమ్మ, శ్రీకాంత్, సంపత్‌బెనర్జీ, స్వప్న పాల్గొని 443 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ పేదవాళ్లకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేట ఎస్ఐగా సూర్యభగవాన్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ నూతన ఎస్ఐ-1గా ఎం.సూర్యభగవాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యభగవాన్ తూర్పు గోదావరి జిల్లా పెరవల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ సూర్యభగవాన్ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

ముమ్మరంగా కులగణన

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది బుధవారం ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలతో పాటు కులం పేరును ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీవో దీప్తి మాట్లాడుతూ మండలంలో మొత్తం 71,290 జనాభా ఉన్నారని. వాటిలో 60,487 జనాభా కులగణన పూర్తయినట్లు చెప్పారు. మొత్తం 91శాతం కులగణన పూర్తయిందని వివరించారు.

వేగంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



నందిగామలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో పి.సాయిబాబు



రామిరెడ్డిపల్లిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీస్తున్న నందిగామ తహసీల్దార్ వై.సరస్వతి

నందిగామ: డివిజన్ పరిధిలో జగనన్న మోడల్ కాలనీల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతంగా సాగుతోందని ఆర్డీఓ పి.సాయిబాబు తెలిపారు. పట్టణంలోని 1,7వ సచివాలయాల్లో చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్ సిబ్బందికి పలు చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అన్ని సచివాలయాల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతోందన్నారు. రిజిస్ట్రేషన్ మరింత వేగవంతం చేసేలా సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని రామిరెడ్డిపల్లిలో జరుగుతున్న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నందిగామ తహసీల్దార్ వై.సరస్వతి బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన రిజిస్ట్రేషన్ల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి తగిన ఆదేశాలు జారీచేశారు.

రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్ సమీక్ష

వీరులపాడు: రెవెన్యూ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు. మండలంలోని జుజ్జూరు రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకిషోర్ మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బంది పని తీరుపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అభినయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవైష్ణవి, వాహికా విజయ్, యశస్విని, యితీక, తన్మయి, హరిణిలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు : భరద్వాజ్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ఆలయంలో భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. గిరి ప్రదక్షిణ రహదారిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆలయం కావడంతో నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. రూ. కోటితో చేపట్టిన గిరి ప్రదక్షిణ రహదారిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు రూ. 10,116లను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జుజ్జూరు(వీరులపాడు): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పాఠశాలలో మెరుగుపడిన శుభ్రత

- నాడు-నేడుతో పాఠశాలల్లో మెరుగుపడిన మరుగుదొడ్లు
- బాలబాలికలకు వేర్వేరుగా నిర్మాణం
- పరిశుభ్రతకు ప్రత్యేకంగా ఆయాల నియామకం
- సదుపాయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం



గతంలో కొణకంచి ఆదర్శ పాఠశాలలో మరుగుదొడ్లు



కొణకంచి ఆదర్శ పాఠశాలలో నూతనంగా నిర్మించిన టాయిలెట్లు

పెనుగంచిప్రోలు: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా, అధ్వానంగా ఉండేవి. కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే అందులో ఉండేవి. వాటి శుభ్రతకు ప్రత్యేకంగా సిబ్బంది సైతం ఉండేవారు కాదు. దీంతో మరుగుదొడ్లు లేక బాలికలు అనేక ఇబ్బందులు పడేవారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మారిపోయింది. ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు నేడు ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 137 ఉండగా, వీటిలో 15,807మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు వీటి శుభ్రతకు 154మంది ఆయాలను నియమించారు. మరుగుదొడ్లుకు రన్నింగ్ వాటర్ సదుపాయాలు కల్పించడంతోపాటు కార్పొరేట్ హంగులు ఏర్పాటు చేశారు.

ఆయాల నియామకం..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయాలను నియమించారు. ఆయాలకు అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏడాదికి జమచేస్తున్న రూ.15వేల నుంచి కొంత నగదును తల్లిదండ్రుల అంగీకారంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాయిలెట్ ఫండ్ నుంచి జీతాలు చెల్లిస్తున్నారు. ఒక్కో ఆయాకు నెలకు రూ.6వేలు ఇస్తున్నారు. మరుగుదొడ్ల శుభ్రతకు అవసరమైన శానిటేషన్ వస్తువులు, రసాయనాలు సైతం ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

నైట్ వాచ్‌మెన్ నియామకం..

గతంలో జెడ్పీ హైస్కూల్లో ఉండే విలువైన సామాగ్రికి ఎటువంటి రక్షణ చర్యలు ఉండేవి కావు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా ప్రతి జెడ్పీ పాఠశాలకు నైట్‌వాచ్‌మెన్ నియమించారు. దీంతో రాత్రి సమయాల్లో రక్షణ ఏర్పడింది. విద్యావ్యవస్థలో వస్తున్న ఇటువంటి పెనుమార్పులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో హర్షం తెలుపుతున్నారు.



టాయిలెట్ శుభ్రం చేస్తున్న ఆయా



ముచ్చింతాల యూపీ పాఠశాలలో టాయిలెట్

ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నాం..



ప్రతిరోజూ టాయిలెట్లను శుభ్రం చేస్తున్నాం. శుభ్రం చేసేందుకు అవసరమైన శానిటేషన్ వస్తువులన్నింటినీ ప్రభుత్వమే సమకూరుస్తోంది. బకెట్లు, జగ్గులు, క్లీనర్ ద్రావణాలు, స్ప్రే బాటిళ్లు, అన్నీ అందుబాటులో ఉండటంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం.

– సునీత, ఆయా

పెద్ద ఎత్తున నిధులు..



ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. ప్రతి పాఠశాలకు ఆయాలను నియమించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారం. టాయిలెట్స్‌కు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించడంతో పరిశుభ్రంగా ఉంటున్నాయి.

– డి.రవీంద్ర, ఎంఈఓ, పెనుగంచిప్రోలు